మార్మోగిన శివనామస్మరణ

సాక్షి నెట్‌వర్క్: మహా శివరాత్రిని పురస్కరించుకొని చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్, హుస్నాబాద్ నియోజకవర్గాల్లోని శివాలయాలు బుధవారం భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి శివయ్య దర్శనం కోసం భక్తులు ఆలయాలకు క్యూ కట్టారు. అభిషేకాలు, ప్రత్యేక పూజలతోపాటు ఉపవాస దీక్ష, జాగరణ చేశారు. పలువురు ప్రజాప్రతినిధులు శివుడిని దర్శించుకొని వివిధ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సాయంత్రం శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. బుధవారం వేకువజాము నుంచి రాత్రి వరకూ భక్తులు ఆలయాలకు పోటెత్తారు. భక్తులు శివపార్వతుల కల్యాణంలో పాల్గొని తరించారు. తమ కోర్కెలు తీరాలని మనసారా దేవుడిని కోరుకున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఆలయాల కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


చొప్పదండి: శివకేశవాలయంలో బారులు తీరిన భక్తులు


తిమ్మాపూర్: మృత్యుంజయ ఆలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పూజలు


మానకొండూర్: గంగిపల్లిలో శివకల్యాణానికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ


గంగాధర: కొండన్నపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పూజలు


హుజూరాబాద్: చెల్పూర్‌లో శివపార్వతుల కల్యాణం


హుజూరాబాద్ శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి


గంగాధర: కొండన్నపల్లి శివాలయంలో భక్తుల బారులు


జమ్మికుంట: అభిషేకం చేస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌రావు, తదితరులు


తిమ్మాపూర్: మృత్యుంజయ ఆలయంలో భక్తుల పూజలు


చొప్పదండిలో...



ఇల్లందకుంటలో శివపార్వతుల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు, కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు


జమ్మికుంట: దర్శనం కోసం భక్తుల క్యూ


గంగాధరలో శివపార్వతుల కల్యాణం


రామడుగు: వెదిర శివాలయంలో భక్తుల పూజలు


శంకరపట్నం: తాడికల్ శివాలయంలో భక్తులు


శంకరపట్నం: కొత్తగట్టు గుట్టపై అగ్నిగుండాలు


శంకరపట్నం: కన్నాపూర్‌లో శివపార్వతుల కల్యాణం తిలకిస్తున్న మహిళలు


హుజూరాబాద్: శివాలయంలో వొడితెల ప్రణవ్ పూజలు

క్లుప్తంగా

పెండింగ్ జీతాలు చెల్లించాలి


మాట్లాడుతున్న కొప్పుల శంకర్

హుజూరాబాద్: గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకుడు కొప్పుల శంకర్ ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఒకటో తేదీ నుంచి పదో తేదీలోపు కార్మికుల ఖాతాల్లో జీతాలు వేయాలని, ఉద్యోగ భద్రత, పర్మనెంట్, కనీస వేతనం చెల్లించాలనే డిమాండ్లు ఏడాదిగా పరిష్కారం కావడంలేదని, కార్మికుల న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించాలని, జీతాలు వెంటనే చెల్లించాలన్నారు. సమావేశంలో నాయకులు రవీందర్‌రావు, సారయ్య,కొమురయ్య, శంకర్, లక్ష్మీనారాయణ, మొలుగూరి ప్రేమ్‌కుమార్, గంధసిరి సంపత్, సమ్మయ్య, చంద్రయ్య, రాజు తదితరులున్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించండి

గన్నేరువరం: కరీంనగర్–ఆదిలాబాద్–నిజామాబాద్–మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని పార్టీ గన్నేరువరం మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తిప్పర్తి పరిపూర్ణాచారి కోరారు. బుధవారం మండలకేంద్రంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలన ద్వారా పేదలు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేస్తున్నారని, ఉద్యోగ నోటిఫికేషన్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభ్యున్నతికి కులగణన సర్వే చేపట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు.

బీసీలకు పట్టం కట్టండి

కరీంనగర్ కార్పొరేషన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులకు అవకాశమివ్వాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల రవీందర్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి ఆత్మకూరి తిరుపతి పట్టభద్రులు, ఉపాధ్యాయ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. బుధవారం నగరంలోని సంఘం సమావేశంలో మాట్లాడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రసన్న హరికృష్ణ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలో మల్క కొమురయ్యకు ఓటేసి గెలిపించాలని కోరారు. చాలా సంవత్సరాల తరువాత బీసీల బలం నిరూపించుకొనే అవకాశం వచ్చిందని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులకు పట్టం కట్టాలన్నారు.

పథకం అమలు అంతంతే

- మత్స్యకార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం
- గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సబ్సిడీపై వాహనాలు
- సమీకృత మత్స్యఅభివృద్ధి పథకం కింద ముదిరాజ్‌లకు రుణాలు
- ఉచితంగా చేపపిల్లల పంపిణీ, ఆర్థికంగా అభివృద్ధి చెందిన వైనం


ద్విచక్ర వాహనాలతో లబ్ధిదారులు(ఫైల్)


చిన్నముల్కనూర్ చెరువులో చేపలు విడుదల(ఫైల్)

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల చెరువు, కుంటల్లో చేపపిల్లల పెంపకం పథకం నామమాత్రంగా నిర్వహించడంతో ముదిరాజ్‌ల ఆర్థిక ఆదాయం గణనీయంగా తగ్గిపోయింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో ముదిరాజ్‌లు కొంతవరకు ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడ్డారు. ఉచితంగా చేపపిల్లలు పంపిణీ, 75 శాతం సబ్సిడీపై ద్విచక్ర, ఫోర్‌వీలర్ వాహనాలు అందించగా పలువురు లబ్ధిపొందారు. చేపల వృత్తే వీరి ప్రధాన జీవనోపాధి అయినప్పటికీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వీరి సంక్షేమంపై ఏలాంటి పథకం ప్రవేశపెట్టకపోవడంతో ముదిరాజ్‌లు నిరాశనిస్పృహల్లో కొట్టుమిట్టాడుతున్నారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో సమీకృత మత్స్యఅభివృద్ధి పథకం కింద సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టింది. కానీ ఆ పథకం ద్వారా కనీసం 25 శాతం మందికి కూడా లబ్ధిచేకూరకపోవడంతో ఆయా కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. బీఆర్‌ఎస్ రెండోసారి అధికారంలోకి వచ్చాక ఉచిత చేపపిల్లల పథకాన్ని ప్రవేశపెట్టింది. వరుసగా మూడేళ్లు చెర్వుల్లో వందశాతం సబ్సిడీపై చేపపిల్లలను పోశారు. అవి పెరిగి పెద్దయ్యాక గ్రామాల్లో విక్రయించి ముదిరాజ్‌లు సొమ్ముచేసుకున్నారు.

11 మత్స్యపారిశ్రామిక సహకార సంఘాలు

చిగురుమామిడి మండలంలో 17 గ్రామాలుండగా అందులో బొమ్మనపల్లి, చిగురుమామిడి, ఇందుర్తి, కొండాపూర్, ముదిమాణిక్యం, చిన్నముల్కనూర్, నవాబుపేట్, రేకొండ, సుందరగిరి, ఉల్లంపల్లి, రామంచలో మత్స్యపారిశ్రామిక సహకార సంఘాలున్నాయి. ఈ సంఘాల్లో దాదాపు 2000 వేల మంది సభ్యత్వం కలిగి ఉన్నారు. ఇంకా అర్హులైన సభ్యులున్నప్పటికీ సభ్యులుగా చేరలేదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2018–19వ సంవత్సరంలో మండలంలోని 340 మంది ముదిరాజ్‌లకు సమీకృత మత్స్య అభివృద్ధి పథకం కింద ప్రభుత్వం నుంచి సబ్సిడీ అందింది. 322 మందికి టూవీలర్స్, 13 మందికి ఆటోలు, నాలుగు మొబైల్ వాహనాలు, ఒక హైజెనిక్ వాహనాలను అర్హులైన వారికి అందించారు. వీటిలో ప్రతి వాహనానికి 75 శాతం సబ్సిడీ పోగా మిగిలిన 25 శాతం డబ్బులను లబ్ధిదారులు చెల్లించారు. టూవీలర్లు పొందిన ముదిరాజ్‌లు చేపలను విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నారు.

16.71 లక్షల చేపపిల్లల పెంపకం

2023–24వ సంవత్సరంలో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం మండలంలోని 78 చెరువు, కుంటల్లో 16.71 లక్షల చేపపిల్లలను వంద శాతం సబ్సిడీపై ఉచితంగా విడుదల చేశారు. అదే సంవత్సరంలో ప్రస్తుత ప్రభుత్వం యాభై శాతం చేపపిల్లలను విడుదల చేసింది. సగానికి సగం చేపపిల్లలు తగ్గిపోయాయని, వీటితో తమ జీవనాధారం ఎలా సాగేదని ఆయా గ్రామాల ముదిరాజ్ కుటుంబాలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

జీవనోపాధి పొందుతున్న



సబ్సిడీపై టూవీలర్ తీసుకున్నాను. సబ్సిడీ పోను నా వాటా రూ.13,500 చెల్లించాను. చేపలు విక్రయించేందుకు ప్రస్తుతం ద్విచక్ర వాహనంపై గ్రామాల్లో తిరుగుతూ జీవనోపాధి పొందుతున్నాను.

– బరిగెల సదానందం, చిన్నముల్కనూర్

సబ్సిడీపై వాహనం తీసుకున్నా



సమీకృత మత్స్యఅభివృద్ధి పథకం కింద టాటా ఏస్ వాహనం సబ్సిడీపై తీసుకున్నాను. 25 శాతం వాటా కింద రూ.1.50 లక్షలు చెల్లించాను. చేపల అమ్మకం, ఇతర వ్యాపారంతో జీవనం సాగిస్తున్నాను.

–పెసరి శ్రీనివాస్ ముదిరాజ్, చిగురుమామిడి

ఉచితంగా పంపిణీ



ఈ ఏడాది యాభైశాతం వరకు ఉచితంగా చేపపిల్లలు పంపిణీ చేశాం. మత్స్యకారుల సంక్షేమ కోసం ప్రభుత్వం జాతీయ ఫిషరీస్ డిజిటల్ ప్లాట్‌ఫాం(ఎన్‌ఎఫ్‌డీపీ)పథకం ప్రవేశపెట్టింది రిజిస్ట్రేషన్ చేసుకుంటే పథకాలు వర్తిస్తాయి.

– విజయభారతి, మత్స్యశాఖ ఏడీ, కరీంనగర్



జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల మైదానం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. రాత్రి వేళ మద్యం సేవిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. పోలీసులు నిఘా పెంచాలని, కళాశాల మైదానంలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా అడ్డుకట్టు వేయాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
వరగంటి రవి, జమ్మికుంట టౌన్ సీఐ సెల్ నంబర్: 8712670776

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు

చొప్పదండి: పట్టణంలో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. చొప్పదండిలోని రెండు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా సుమారు మూడు వేల మంది ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. బుధవారం సాయంత్రం పోలింగ్ అధికారులు, సిబ్బంది కేంద్రాలకు చేరుకున్నారు.

శంకరపట్నం: ఎన్నికల సామగ్రితో పోలింగ్ సిబ్బంది కేశవపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చేరుకున్నారు. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అధికారులు కేశవపట్నం పాఠశాలలో మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎస్సై రవి ఆధ్వర్యంలో సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు.


శంకరపట్నం: కేశవపట్నం జెడ్పీహెచ్ఎస్‌కు చేరుకున్న పోలింగ్ సిబ్బంది

భక్తిగీతం చిత్రీకరణ


భక్తిగీతం చిత్రీకరణలో యూనిట్ బృందం

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట గ్రామ శ్రీమానసాదేవి ఆలయ భక్తి గీతం చిత్రీకరణ బుధవారం బీజేపీ నాయకులు సొల్లు అజయ్‌వర్మ, చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి ఆలయంలో ప్రారంభించారు. భాగ్యలక్ష్మీ క్రియేషన్స్ గుండేటి మ్యూజిక్స్ అండ్ మూవీస్ ఆధ్వర్యంలో పాట చిత్రీకరిస్తున్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, సినీ గేయ రచయిత గుండేటి రమేశ్, నటి మనీషా, కెమెరామెన్ ప్రేమ్‌సాయి, డైరెక్టర్ అక్కెన భాస్కర్, భక్తులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

వీణవంక: మండలంలోని కనపర్తి గ్రామ శివారులో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నామని ఎస్సై తోట తిరుపతి తెలిపారు. కోర్కల్ మానేరు వాగు నుంచి శంకరపట్నం మండలంకు అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుకొని డ్రైవర్ కొలిపాక శ్రీదర్, ఓనర్ సుద్దాల దేవుడుపై కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించామని ఎస్సై వివరించారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

జమ్మికుంట: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ వరంగంటి రవి తెలిపారు. వీణవంక మండలం పోతిరెడ్డిపేట గ్రామానికి చెందిన అలవేని అనిల్ ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న క్రమంలో బుధవారం పట్టణంలో పట్టుకొని కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.